# ఇక్కడే పుట్టిన.. ఇక్కడే పెరిగిన



జలాల్‌పూర్ గ్రామంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

- మాయ మాటలు, కిరాయి మనుషులను నమ్మి మోసపోకండి
- నాగిరెడ్డిపేట మండలంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్

ఎల్లారెడ్డి, నవంబర్ 26 : ఎక్కడో పుట్టి.. ఇంకెక్కడో పెరిగి...మాయ మాటలు చెప్పే మదన్ మోహన్‌ను నమ్మొద్దని ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జాజాల సురేందర్ సూచించారు. తాను ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగిన ప్రజల మనిషినని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా అందుబాటులో ఉంటానని తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని జలాల్ పూర్, చిన్న ఆత్మకూర్, ఆత్మకూర్, మాటూర్, మాసాన్‌పల్లి, తాండూర్, రాఘవపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను పక్కనే నల్లమడుగు గ్రామంలో పుట్టి పెరిగానని తెలిపారు. అనారోగ్యం, ఆపద వచ్చినప్పుడు ప్రతి కుటుంబానికీ అండగా నిలుస్తున్నానని గుర్తుచేశారు. పేదల వైద్యం కోసం ఎల్‌వోసీలు, సీఎంఆర్‌ఎఫ్ ఇప్పించి ఆర్థిక భరోసా కల్పించానన్నారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ రాజకీయం చేసేటోళ్లను, స్థానిక సమస్యలు తెలియని నాయకులను నమ్మొద్దన్నారు. కిరాయి మనుషుల్ని తీసుకువచ్చి స్థానికులపై పెత్తనం చెలాయించేవారిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.

**కేసీఆర్‌ను మరువొద్దు..**

పదేండ్ల కిందట వ్యవసాయం దండుగ అన్నవారి అడ్రస్ లేకుండా పోయారని జాజాల తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, సాగునీరు, రైతుబంధు అందించడంతోపాటు రైతుబీమాతో అన్నదాతల కుటుంబాల్లో ధీమా కల్పించిన సీఎం కేసీఆర్‌ను మర్చిపోవద్దని అన్నారు. దేశంలోనే ఎక్కడా లేని రైతు సంక్షేమ పథకాలను అందించి వ్యవసాయాన్ని పండుగలా మార్చారని వివరించారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు రూ. 2వేల పింఛన్ ఇస్తున్న బీఆర్‌ఎస్‌ను మళ్లీ గెలిపించుకుంటే రూ. 5వేలకు పెరుగుతుందని భరోసా కల్పించారు. అంతకుముందు బీఆర్‌ఎస్ ప్రచారానికి ఆయా గ్రామాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బోనాలు, మంగళహారతులు, డప్పువాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే జనార్ధన్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, నాయకులు సంపత్ గౌడ్, గుర్రాల సిద్ధయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ రెడ్డి, దుర్గారెడ్డి, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### గతంలో ఎవరైనా బీడీ పింఛన్లు ఇచ్చిండ్రా?

ఆత్మకూర్ గ్రామంలో పలువురు బీడీ కార్మికులతో జాజాల ప్రత్యేకంగా మాట్లాడారు. బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను గతంలో ఎవరైనా పట్టించుకున్నారా అని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం మహిళల కష్టాలను గుర్తించి కార్మికులకు ప్రత్యేకంగా బీడీ పింఛన్ పథకం అమలు చేశారని తెలిపారు. దేశంలోని ఏ ప్రభుత్వమూ బీడీ పింఛన్లు ఇవ్వడంలేదన్నారు. రాబోయే బీఆర్‌ఎస్ సర్కారులో అర్హత ఉన్న ప్రతి పేద మహిళకూ సౌభాగ్యలక్ష్మి పేరిట ప్రతి నెలా రూ. 3వేలు అందించనున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్‌ను మళ్లీ గెలిపించుకోవాలని ప్రజలను కోరారు.



బీడీ కార్మికులతో మాట్లాడుతున్న సురేందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం

# షిండేకే నా మద్దతు

- నా సత్తా ఏమిటో కాంగ్రెస్‌కు చూపిస్తా..
- బీఆర్‌ఎస్‌నే గెలిపించాలని అభిమానులకు మాజీ ఎమ్మెల్యే గంగారాం పిలుపు

పెద్ద కొడప్‌గల్, నవంబర్ 26 : జుక్కల్ నియోజకవర్గ ప్రజలు, తన అభిమానులందరూ కారు గుర్తుకే ఓటేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గంగారాం పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 46 ఏండ్లు పార్టీలు మారకుండా కాంగ్రెస్‌ను నమ్ముకుంటే తనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా తనను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత రిజర్వేషన్ ఉన్న జుక్కల్ నియోజకవర్గానికి ఇన్నేండ్లుగా సేవచేసిన తననుకాదని, మున్నూరు కాపో.. ఎస్సీనో తెలియని వ్యక్తికి టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పార్టీకి ద్రోహం చేసినా మళ్లీ ఆయనకే బోధన్ టికెట్ ఇచ్చారని, దళితుడనైనా తనను దూరం పెట్టారని మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖ మంత్రిగా వేల కోట్ల అవినీతికి పాల్పడినా పార్టీ పట్టించుకోలేదని, తనపై ఒక్క ఆరోపణ లేకున్నా టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం నిరాకరించిందని అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో గంగారాం పని అయిపోయిందని ప్రచారం చేస్తున్నవారికి మన సత్తా ఏమిటో చూపించాలని అనుచరులు, అభిమానులను కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతారావును ఓడించేందుకు బీఆర్‌ఎస్‌కు ఓటేసి హన్మంత్ షిండేను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

# అంగరంగ వైభవంగా రథోత్సవం

- గోవింద నామస్మరణతో మార్మోగిన నింబాచల క్షేత్రం
- పాల్గొన్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

భీమ్‌గల్, నవంబర్ 26: నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని నింబాచల క్షేత్రం ఆదివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన నృసింహుని బ్రహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సవం నిర్వహించగా.. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో కొండ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది. కొండ దిగువన ఏర్పాటు చేసిన జాతర ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షాపులతో సందడిగా మారింది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ వెంకటేశ్వర్లు బందోబస్తు నిర్వహించారు

**రథోత్సవంలో పాల్గొన్న మంత్రి వేముల..**

రథోత్సవంలో రాష్ట్ర రోడ్లు,భవనాలు,గృహనిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా స్వామివారి రథాన్ని లాగారు. జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.



భక్తులతో కలిసి రథాన్ని లాగుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

# రాహుల్ సభ వెలవెల

- నాయకుల కహానీలు వినని జనం
- ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయిన వైనం

కామారెడ్డి, నవంబర్ 26 : జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన రణభేరి సభ మరోసారి వెలవెల బోయింది. పది రోజుల క్రితం కర్ణాటక సీఎం సిద్దరామయ్యతో నిర్వహించి సభ ఫ్లాప్ కావడంతో ఈ సారి రాహుల్ గాంధీ వచ్చినప్పటికీ జనాల్లో స్పందన కరువైంది. ఆయన ప్రసంగాన్ని తెలుగులో అనువదించినప్పటికీ ప్రజలను ఆకట్టుకోలేదు. రాహుల్ గాంధీ ఎంతసేపూ.. ఆరోపణలు చేయడానికే సరిపోగా, ప్రజలకు ఏం చేస్తాడో చెప్పుకోలేకపోయాడు. సభలో చాలావరకు ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వచ్చిన మెజార్టీ ప్రజలు ప్రసంగాన్ని వినకుండానే ఇండ్లకు తిరుగుముఖం పట్టారు. దీంతో రాహుల్ గాంధీ 20 నిమిషాల్లోనే తన ప్రసంగాన్ని ముగించగా, బీఆర్‌ఎస్ పార్టీతోపాటు కేసీఆర్‌ను విమర్శించడం తప్ప వారి హామీల గురించి చెప్పలేదు. అనంతరం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్నంత సేపు జనం లేక కుర్చీలు వెలవెల బోయాయి. రేవంత్‌రెడ్డి 7 నిమిషాలపాటు మాట్లాడారు. ప్రసంగిస్తున్న సమయంలో కామారెడ్డి నియోజకవర్గానికి బదులుగా కరీంనగర్ నియోజకవర్గం అని రెండు సార్లు పలకడంతో ప్రజలు గందరగోళంలో పడ్డారు. రేవంత్‌రెడ్డి కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నాడా లేదంటే కరీంనగర్ నుంచి పోటీ చేస్తున్నాడా అని ముక్కున వేలేసుకున్నారు. ఆయా మండలాల నుంచి తరలించిన ప్రజలు సభకు వెళ్లకుండా రోడ్లపైనే తిరిగారు. చాలా మంది ఇండ్లకు వెళ్లిపోయారు. కొందరు సభలో కూర్చోకుండా వేర్వేరు చోట్ల సేదతీరారు.



రాహుల్ గాంధీ ప్రసంగం వినకుండానే సభా ప్రాంగణం నుంచి వెళ్లిపోతున్న జనం



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న హన్మంత్‌షిండే

# కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి..

## షిండే సమక్షంలో 50 మంది చేరిక

బిచ్కుంద, నవంబర్ 26: గులాబీ పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతున్నది. మండలంలోని చిన్న దడ్గి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బాల్‌గొండతోపాటు 50 మంది కార్యకర్తలు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో హన్మంత్ షిండే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న బీఆర్‌ఎస్‌ను మరోసారి అధికారంలోకి తెచ్చుకోవాలని షిండే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాజిద్‌నగర్ ఎంపీటీసీ సాయిలు, డాక్టర్ రాజు, ముఖీద్ తదితరులు పాల్గొన్నారు.